సాక్షి అన్నమయ్య జిల్లా

శనివారం । 28 । సెప్టెంబర్ । 2024



పోలీస్‌స్టేషన్ల స్థలాల రక్షణకు చర్యలు

జిల్లాలో పోలీస్‌స్టేషన్లకు చెందిన స్థలాలను పరిశీలించి, వాటిని హద్దులతో రక్షణ చేయడం పోలీసుల కర్తవ్యం అని జిల్లా పోలీస్ అధికారి విద్యాసాగర్‌నాయుడు అన్నారు. -8లో



ఇంట్లో ఎవరూ లేనిది చూసి.. దోచేశారు

తాళం వేసిన ఇళ్లనే దొంగలు లక్ష్యంగా చేసుకున్నారు. గొల్లపల్లిలో మూడు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. నగదు, బంగారు కమ్మలు దోచుకెళ్లారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్ఠం	గరిష్ఠం
మొదటిరకం	రూ.430	రూ.520
రెండోరకం	రూ.320	రూ.420



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 110 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్ఠం	గరిష్ఠం
బైవోల్టిన్	582	600
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 122.400 కిలోలు

దుష్ప్రచారంపై ధర్మాగ్రహం

- తిరుమలతోపాటు లడ్డూ పవిత్రతను దెబ్బతీసేలా చంద్రబాబు అసత్య ప్రచారం
- నేడు ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- తిరుపతికి వెళ్లకుండా పార్టీ నేతల హౌస్ అరెస్టులు, అడ్డగింత



రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి ఇంటిలో ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి, ఆయన సోదరుడు పి.గిరిధర్‌రెడ్డి తదితరులు

సాక్షి రాయచోటి: తిరుమల పవిత్రతను..స్వామి వారి లడ్డూ ప్రసాదం విశిష్టతను..వెంకటేశ్వరస్వామి వైభవంతోపాటు టీటీడీ పేరు ప్రఖ్యాతులను రాజకీయ దుర్బుద్ధితో అసత్య ప్రచారం చేస్తున్న కూటమి సర్కార్‌పై వైఎస్సార్ సీపీ పోరుబాటకు సిద్ధమైంది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రస్తుత సీఎం చంద్రబాబు చేస్తున్న కుట్రలు, కుతంత్రాలతో చేస్తున్న రాజకీయ దుష్ప్రచారంపై యుద్ధం ప్రకటించారు. పవిత్రమైన తిరుమల వెంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కల్తీ జరగకపోయినా జరిగినట్లు చేస్తున్న ప్రచారంపై వైఎస్సార్ సీపీ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. మరోవైపు చంద్రబాబు అనుసరిస్తున్న వైఖరిని నిరసిస్తూ ఆలయాల్లో పూజలు చేయాలని పార్టీ నిర్ణయించింది.

- కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చి నాలుగు నెలలవుతున్నా ఇప్పటికీ సూపర్ సిక్స్ అమలు చేయకపోగా, సవాలక్ష కారణాలు చెబుతూ ఏదో ఒక రకంగా ముందుకు వెళుతుండంపై ప్రజల్లో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి తరుణంలో ఏదో ఒక రకంగా టాపిక్‌ను డైవర్ట్ చేయడమే లక్ష్యంగా బాబు అండ్ కో బృందం మైండ్‌గేమ్ ఆడుతున్నారని వైఎస్సార్‌సీపీ శ్రేణులు మండిపడుతున్నాయి. ఇంతవరకు హామీల అమలుకు కూటమి సర్కార్‌కు అవకాశం ఇచ్చిన వైఎస్సార్ సీపీ ఇక నేరుగా రంగంలోకి దిగాలని భావించి యుద్ధం ప్రకటించింది.



నేడు ఆలయాల్లో ప్రత్యేక పూజలు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు శనివారం రాష్ట్ర వ్యాప్తంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. అన్నమయ్యతోపాటు వైఎస్సార్ జిల్లాలోని ఆలయాల్లో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. తిరుమల పవిత్రతను దెబ్బతీస్తున్న నాయకులకు బుద్ధిరావాలని, లడ్డూ ప్రసాదంలో ఎలాంటి కల్తీ జరగలేదని... జరగని దానిని జరిగినట్లు చెబుతున్న కూటమి పెద్దలకు కనువిప్పు కలగాలని..వెంకటేశ్వర స్వామి పవిత్రతకు భంగం కలిగిస్తున్న వైనాలను నిరసిస్తూ పార్టీ శ్రేణులు శనివారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

అడుగడుగునా నిర్బంధం

మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరుమలకు వస్తున్నారన్న విషయాన్ని తెలుసుకుని ఆయనను కలిసేందుకు వస్తున్న పార్టీ నేతలు పోలీసులు ఎక్కడికక్కడ అడ్డగించారు. కొంతమంది నేతలను ఇళ్ల వద్దనే గృహ నిర్బంధం చేయగా, మరికొంతమందికి నోటీసులు ఇచ్చి అదుపు చేశారు. ప్రధానంగా వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డిని, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, వైఎస్సార్ జిల్లా పార్టీ అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, కడప మేయర్ సురేష్‌బాబు, బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు మాజీ ఎమ్మెల్యేలు రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, సుధీర్‌రెడ్డిలకు నోటీసులు ఇచ్చి ఇంటి నుంచి కదలకుండా చేశారు. అలాగే రాష్ట్ర నాయకులు రెడ్యం వెంకట సుబ్బారెడ్డిని కూడా పోలీసులు అడ్డగించారు. తిరుపతికి వెళుతున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డిని రైల్వేకోడూరు చెక్‌పోస్టు వద్ద ఆపి వెనక్కి పంపించారు. మదనపల్లె ఇన్‌చార్జి నిసార్ అహ్మద్‌ను కూడా హౌస్ అరెస్టు చేశారు. మాజీ ఎమ్మెల్యే దేశాయ్‌తిప్పారెడ్డికి పోలీసులు నోటీసులు అందజేశారు. అలాగే మున్సిపల్ వైస్ చైర్మన్ నూర్‌ఆజం, కౌన్సిలర్లు రామిశెట్టిశివయ్య, ఈశ్వర్‌నాయక్, వై.గిరిజ, రేణుకమ్మ తదితరులకు నోటీసులు జారీచేశారు.



వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్‌తో మాట్లాడుతున్న పోలీసులు

వైఎస్ జగన్‌ను అడ్డుకోవడం పిరికితనం

వాల్మీకిపురం: శ్రీవారిని దర్శంచుకునేందుకు వెళ్తున్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని అడ్డుకోవడం కూటమి ప్రభుత్వ పిరికితనమని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం వాల్మీకిపురంలో విలేకరులతో మాజీ ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ అనేక పర్యాయాలు శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని తిరుమలకు వెళ్లకుండా పోలీస్ యంత్రాంగాన్ని అడ్డంపెట్టుకొని అడ్డుకోవడం సమంజసం కాదన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా డిక్లరేషన్ విధానాన్ని తెరపైకి తీసుకురావడం కూటమి ప్రభుత్వం లబ్ధి కోసమేనన్నారు. మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డిని అడ్డుకోవడం కోట్లాది మంది హిందువుల మనోభావాలను దెబ్బతీయడమేనన్నారు. కలియుగ దైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామి వారే కూటమి ప్రభుత్వానికి తగిన శిక్ష విధిస్తానారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు నీళ్ల భాస్కర్, ఉపసర్పంచ్ బిడ్డల కేశవ రెడ్డి, మాజీ సింగల్ విండో అధ్యక్షులు శ్రీధర్ రాయల్, నాయకులు మధనమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల

దైవంతో ఆటలాడటం చంద్రబాబుకు తగదు

- మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు అర్బన్: ప్రపంచంలో ప్రతి ఒక్కరికీ దేవదేవుడు వెంకటేశ్వరస్వామి. రోజుకు 90 వేల మందికి పైగా దర్శించుకునే ఆరాధ్య దైవంతో రాజకీయ కుట్రలో భాగంగా ఆటలాడటం చంద్రబాబుకు తగదని మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం రైల్వేకోడూరులోని పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ , దైవంతో ఆటలాడటం సబబు కాదని తెలిపారు. ముఖ్యంగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాం నుంచి ఎన్నోమార్లు సంప్రదాయబద్ధంగా వెంకటేశ్వరస్వామిని దర్శించుకుంటూ ఉన్నారని ఆయన పేర్కొన్నారు. ఆయనపై విమర్శలు చేయడం సబబు కాదన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి 40శాతం పైబడి ఓట్లు వచ్చాయన్న ద్వేషంతో ముఖ్యమంత్రి చంద్రబాబు కుట్రపూరితంగా తన అనుచరులతో విమర్శలు చేయిస్తూ వైఎస్ జగన్‌ను ప్రజల్లో తక్కువ చేయాలనే ఉద్దేశంతోనే డిక్లరేషన్ వంటి అంశాలు తెచ్చారన్నారు. సీఎం హోదాలో ఉంటూ సున్నితమైన విషయమైనటువంటి తిరుమల లడ్డూ గురించి మాట్లాడటం సిగ్గు చేటన్నారు. కల్తీ జరిగి ఉంటే చర్యలు తీసుకోవాలే తప్పా మత విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా మాట్లాడటం సరికాదన్నారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నా, ప్రతిపక్ష నాయకుడుగా ఉన్నా కులాలకు, మతాలకు అతీతంగా పండుగలు జరుపుకుంటున్నారన్న విషయం మీకు తెలియదా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లు కేవలం మత విద్వేషాలు రెచ్చగొట్టడానికే ఇలాంటి డ్రామాలు ఆడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ కన్వీనర్ సిహెచ్ రమేష్, మండల నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

బాధ్యతల స్వీకరణ



మదనపల్లె ఆర్టీఓ అశోక ప్రతాపరావు

మదనపల్లె: మదనపల్లె రీజనల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్(ఆర్టీఓ)గా అశోకప్రతాపరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అమలాపురం ఆర్టీఓగా పనిచేస్తున్న ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా మదనపల్లె ఆర్టీఓగా స్థానిక ఎంవీఐ కార్యాలయంలో బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా అశోకప్రతాపరావు మాట్లాడుతూ... ట్రాన్స్‌పోర్ట్ సేవలకు సంబంధించి డివిజన్‌లోని వాహనదారులు రాయచోటికి వెళ్లాల్సి వచ్చేదని, మదనపల్లె డివిజన్‌లోని 11 మండలాలకు సంబంధించి రవాణాశాఖ సేవలను ఇక్కడి నుంచే అందిస్తామని చెప్పారు. ఆన్‌లైన్ అనుసంధాన పనులు జరుగుతున్నాయని, త్వరలోనే సేవలు అందుబాటులోకి తెస్తామని చెప్పారు.

నెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో పీడీలు, కోచ్‌లు

మదనపల్లె సిటీ: మదనపల్లె మండలం సీటీఎం జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్స్ నెట్‌బాల్ అండర్–17 బాల,బాలికల జిల్లా జట్టు ఎంపిక చేశారు. జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. ఇందులో ప్రతిభ కనబరిచిన వారిని ఎన్నుకున్నట్లు స్కూల్ గేమ్స్ జిల్లా కార్యదర్శి వసంత తెలిపారు. వీరు త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ అసిస్టెంట్ సెక్రటరీ నాగరాజు, పీడీ నరేష్, హెచ్‌ఎం ఆంజనేయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంపికైన బాలికలు: చంద్రకళ, జనవి, భీష్మ, సింధు, సంధ్య, కోమతి, వర్ష,ఉమ, నిర్మల, అమ్ములు, వాణిశ్రీ,గ్రీష్మ, స్టాండ్‌బైలుగా తనిష్క, శృతి, రమ్య, శైలజ

బాలురు: మునిమోహిత్, హేమంత్‌నాయక్, రామ్, అభిలాష్, ధనుష్, సాయిప్రకాష్, సంతోష్‌రెడ్డి, జకారుల్లా, భవనీష్, భరత్, మౌనీశ్వర్‌రెడ్డి, రెడ్డిశేఖర్, స్టాండ్‌బైలుగా చరణ్‌తేజ, వాసు, సతీష్ ఎంపికయ్యారు.

ఉత్తమ షూటింగ్ స్పాట్ అవార్డు అందజేత



ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కలెక్టర్ శ్రీధర్

రాయచోటి: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా షూటింగ్ స్పాట్ విభాగంలో ఉత్తమ పర్యాటక కేంద్ర అవార్డును జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ అందుకున్నారు. శుక్రవారం విజయవాడలో జరిగిన ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలో వివిధ విభాగాల్లో ఉత్తమ పర్యాటక ప్రదేశాలకు అవార్డులను ప్రకటించారు. అన్నమయ్య జిల్లా బి కొత్తకోట మండలంలోని హార్సిలీహిల్స్, సినిమాల చిత్రీకరణకు అనువైన ప్రాంతంగా గుర్తింపు పొందింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ అవార్డును అందుకోవడం సంతోషంగా ఉంద న్నారు. జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పర్యాటకశాఖ అధికారి నాగభూషణం పాల్గొన్నారు.

డెంగీ, మలేరియా నివారణకు చర్యలు



ప్రజలకు వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌ఓ కొండయ్య

రాయచోటి అర్బన్: జిల్లాలో డెంగీ, మలేరియా తదితర వ్యాధుల నివారణకు అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కొండయ్య, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ వేణుగోపాల్ పేర్కొన్నారు.శుక్రవారం రాయచోటి రూరల్ మండల పరిధిలోని వరిగ, కాటిమాయకుంట గ్రామాల పరిధిలో నిర్వహించిన ఫ్యామిలీడాక్టర్ ప్రోగ్రాంను వారు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటి పరిసరాలను ప్రతి ఒక్కరూ శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమల నివారణ చర్యలు చేపట్టడంతో పాటు వాటి బారినపకుండా ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా దోమతెరలను వినియోగించాలన్నారు. వైద్య సిబ్బంది సీజన్‌లో ప్రబలే వ్యాధులు, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు జ్యోతిర్మయి,.మలేరియా సబ్‌యూనిట్ అధికారులు ప్రసాద్‌యాదవ్, జయరామయ్య, సీహెచ్‌ఓ లలిత, వైద్యసిబ్బంది రమణమ్మ, ఉషారాణి, రామచంద్ర, లక్ష్మి పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి అడ్డంకులు సృష్టించడం సరికాదు

ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి



ఎమ్మెల్యే ఆకేపాటికి నోటీసులు అందజేస్తున్న హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు

రాజంపేట రూరల్: శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు అడ్డంకులు సృష్టించటం సీఎం చంద్రబాబుకు తగదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి అన్నారు. ఆకేపాటి ఎస్టేట్‌కు శుక్రవారం ఉదయం పోలీసులొచ్చి ఎమ్మెల్యే ఆకేపాటిని గృహనిర్బంధం చేశారు. తరువాత నోటీసులిచ్చి తిరుమలకు వెళ్లరాదని తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే ఆకేపాటి మాట్లాడుతూ శ్రీవేంకటేశ్వరస్వామి మాల ధరించి మండల దీక్షలు చేసి 23 పర్యాయాలు వేల మంది భక్తులతో కలిసి అన్నమయ్య కాలినడకన పాదయాత్ర చేసి శ్రీవారి దర్శించుకున్నట్లు గుర్తు చేసుకున్నారు. పవిత్రమైన తిరుమల లడ్డూకు అపవిత్రత అంటగట్టి హిందువుల మనోభావాలను దెబ్బతీసిన సీఎం చంద్రబాబు చరిత్రహీనుడుగా మిగిలిపోతాడని మండిపడ్డారు. గతంలో తిరుమలలోని వెయ్యి కాళ్ల మండపాన్ని కూలిచ్చేసింది బాబు ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు. విజయవాడలోని 30 ఆలయాలను అభివృద్ధి పేరుతో కూల్చలేదా బాబు అని నిలదీశారు. రాష్ట్రంలో నీవు కూల్చివేసిన 30 ఆలయాలను పునర్నిర్మాణం చేయడంతో పాటు మరో 2,635 నూతన ఆలయాలకు నిర్మాణం చేపట్టినది జగనన్న కాదా అని అన్నారు. ధూప దీప నైవైద్యాల కింద 5,338 ఆలయాలకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనెడ్డి చేయూతనిచ్చింది మర్చిపోయావా చంద్రబాబు అంటూ చురకలంటించారు. ఇప్పటికైనా బాబు తన తప్పిదాన్ని ఏడుకొండల స్వామి పాదాల వద్ద ఒప్పుకొని సరిదిద్దుకోకుంటే ఆ దేవదేవుడు వేసే శిక్ష నుంచి ఎవరూ కాపాడలేరని హితవుపలికారు. మండల పరిధిలోని ఆకేపాటి ఎస్టేట్‌కు ఎమ్మెల్సీ పి. రామసుబ్బారెడ్డి తన సోదరుడు పీ గిరిధర్‌రెడ్డితో కలిసి శుక్రవారం సాయంత్రం విచ్చేశారు. అనంతరం వారు బాబు నీచ రాజకీయాలమీద, లడ్డూ పవిత్రత మీద చర్చించుకున్నారు.

ప్రేరణ ఉత్సవ్ జాతీయ క్యాంపునకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులతో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు

కడప ఎడ్యుకేషన్: గుజరాత్ రాష్ట్రంలోని వార్డునగర్‌లో ఈ నెల 29 తేదీ నుంచి అక్టోబర్ 5వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయ ప్రేరణ ఉత్సవ్ క్యాంపునకు వైఎస్సార్ జిల్లా కడపకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. ఇందులో నగరంలోని పీఎంశ్రీ గంగాభవాని ఉన్నత పాఠశాలకు చెందిన కర్నాటి భ్రమరాంబిక, పీఎంసీ కేంద్రియ విద్యాలయానికి చెందిన ఇంద్రనీల్‌లు ఎంపికయ్యారు. గత ఏడాది పాఠశాల స్థాయిలో వినూత్న అభ్యసన, సాంకేతికత జోడింపు తదితర అంశాలను పరిగణలోని తీసుకుని జిల్లా నుంచి వీరిద్దరినీ ఈ పోటీలకు ఎంపిక చేశారు. శుక్రవారం రాత్రి వీరు కడప నుంచి గుజరాత్‌కు బయలుదేరి వెళ్లారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

కేవీపల్లె: ఏపీ గురుకుల పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈవో యు. శివప్రకాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని గ్యారంపల్లె ఏపీ గురుకుల పాఠశాలను సందర్శించారు. పాఠశాల భవనాలను, వంటశాలను పరిశీలించారు. అనంతరం తరగతి గదులకు వెళ్లి విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతమైన లక్ష్యాలతో విద్యనభ్యసించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రెడ్డిబాషా, ప్రిన్సిపాల్ బ్రహ్మాజీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమ్మిళిత అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

సంబేపల్లె: స్వర్ణాంధ్ర విజన్ 2047 ప్రజాభిప్రాయంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు స్వచ్ఛందంగా పాల్గొని సమ్మిళిత అభివృద్ధిలో భాగస్వాములు కావాలని జిల్లా విద్యాశాధికారి శివప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. పాఠశాల ఆవరణంలోని భవిత కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను విద్యాశాఖాధికారి తనిఖీ చేశారు. స్కాట్స్ అండ్ గైడ్స్ డిస్టిక్ సెక్రటరీ నరసింహారెడ్డి, జిల్లా సైన్స్ అధికారి ఓబుల్‌రెడ్డి, ఎంఈఓ1 రమాదేవి, ఎంఈఓ2 శ్రీనివాసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో శివప్రకాష్‌రెడ్డి

గండికోటను పర్యాటకంగా తీర్చిదిద్దుతాం



గుర్రపుస్వారీ చేస్తున్న వైఎస్ఆర్ జిల్లా కలెక్టర్ శివశంకర్, ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, జేసీ అదితిసింగ్

గుర్రపుస్వారీని ప్రారంభించిన ప్రజాప్రతినిధులు, అధికారులు

జమ్మలమడుగు: ప్రముఖ పర్యాటక కేంద్రమైన గండికోటను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తామని కలెక్టర్ శివశంకర్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా గండికోటలో పలు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యాటకులను ఆకర్షించేందుకు ఏర్పాటు చేసిన గుర్రపు శాల కేంద్రాన్ని, ఎస్‌బీఐ హరిత హోటల్‌లో ఏటీఎం సెంటర్‌ను కలెక్టర్ శివశంకర్, జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి ప్రారంభించారు. అలాగే గండికోటలో తాగునీటి ఇబ్బందులు లేకుండా రూ. 55 లక్షలతో ఏర్పాటు చేసిన ఓవర్ హెడ్ ట్యాంక్‌ను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో గండికోటను పర్యాటకంగా అభివృద్ధి చేసి ఈ ప్రాంతాన్ని టూరిజం కేంద్రంగా తీర్చిదిద్దడం కోసం కృషి చేస్తామన్నారు. పర్యాటకం అభివృద్ధి జరిగితే నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు.

టూరిస్టులు వివరాలు నమోదు చేసుకోవాల్సిందే..

పర్యాటక కేంద్రమైన గండికోటకు వచ్చే పర్యాటకులు ఇకపై వారి వివరాలు తెలపాలి. శుక్రవారం గండికోట ప్రారంభంలోనే టోల్ గేట్‌ను టూరిజం శాఖ అధికారులు ఏర్పాటు చేశారు. అందులో కోటలో ప్రవేశానికి రుసుం, వాహనాలకు టోల్ గేట్ చెల్లించి వారి వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉంది.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు...

ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా గండికోటలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. పట్టణంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులతో పాటు, ప్రొద్దుటూరు, జిల్లా కేంద్రంలోని పలు పాఠశాలల విద్యార్థులు సైతం గండికోటలో జరిగే సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొని తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి, జిల్లా, రెవెన్యూ, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వినండి.. ఉల్లాసంగా.. ఉత్సాహంగా ..

త్వరలో మదనపల్లెకు ఎఫ్ఎం సేవలు



ఎఫ్ఎం రేడియోలో కార్యక్రమాలు (ఫైల్)

మదనపల్లె సిటీ: వినండి...వినండి..ఉత్సాహంగా...ఉల్లాసంగా... అంటూ మనల్ని తెల్లవారుజామునే నిద్రలేపేందుకూ రానుంది ఎఫ్ఎం (ఫ్రీక్వెన్సీ మాడ్యులేషన్) రేడియోస్టేషన్. దేశంలో 234 నగరాలు, పట్టణాల్లో ఎఫ్ఎం రేడియో స్టేషన్లను ప్రవేశపెట్టేందుకు కేంద్ర మంత్రివర్గం ఇటీవల నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా జిల్లాలో మదనపల్లెకు మూడు ఎఫ్ఎం రేడియో స్టేషన్లకు అవకాశం దక్కింది. త్వరలో ఈ- వేలం ద్వారా వీటిని ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. మదనపల్లెలో 2.50 లక్షల మంది జనాభా ఉండటంతో మూడు స్టేషన్ల ఏర్పాటుకు ఉత్తర్వులు వచ్చాయి. కేంద్ర ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఎఫ్ఎం రేడియో సదుపాయం రానుండటంతో స్థానికుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

మనమాట... మన పాట: ఎఫ్ఎం రేడియో స్టేషన్లలో స్థానిక అంశాలకు ప్రాధాన్యమివ్వనున్నారు. ప్రజలకు అవసరమైన విషయాలు, సంస్కృతి, సంప్రదాయాలు, సంగీతానికి సంబంధించినవి ప్రసారం చేయడం వల్ల ప్రజలను సమాజానికి దగ్గరగా చేస్తాయి. రేడియో స్టేషన్లలో కార్యక్రమాలను సమయానికి అనుగుణంగా ప్రసారం చేయవచ్చు. ఉదాహరణకు ఉదయం సమయాన రేడియోలో స్థానిక వార్తాంశంతో పాటు ట్రాఫిక్ ఆంక్షలు వంటివి ఎప్పటికప్పుడు తెలుపుతారు. ఇవి స్థానికులకు చాలా ఉపయోగపడనున్నాయి.

ప్రతిభకు ప్రోత్సాహం: మదనపల్లెలో నూతన ఎఫ్ఎం రేడియో స్టేషన్ల ఏర్పాటు తో స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి. స్టేషన్‌లో 20 నుంచి 30 మందికి ఉపాధి లభించే అవకాశాలు ఉన్నాయి. పట్టణంలో జరిగే తాజా సమాచారాన్ని శ్రోతలు ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ఆస్కారముంటుంది. వ్యాపార సముదాయాలు, సంఘాలు తమ ఉత్పత్తులు, సేవలను ప్రజలకు చేరవేయడానికి ఎఫ్ఎం రేడియోను ఉపయోగించుకోవచ్చు. ప్రత్యేకించి స్థానిక మార్కెట్లకు ఇది ఫలప్రదంగా ఉంటుంది.

ఎంతో సంతోషం



మదనపల్లెకు ఎఫ్ఎం రేడియో స్టేషన్లు మూడు మంజూరుకావడం సంతోషంగా ఉంది. కేంద్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయం. రేడియోకు మదనపల్లెకు మంచి అనుబంధం ఉంది. ఆలిండియా రేడియోలో మొట్టమొదటి మహిళా న్యూస్ రీడర్ మదనపల్లెకు చెందిన జోళపాళెం మంగమ్మ కావడం విశేషం. మదనపల్లె విశేషాలు రేడియో ద్వారా వినవచ్చు.

– టీ.ఎస్.ఎ.క్రిష్ణమూర్తి, ప్రముఖ నవలా రచయిత, మదనపల్లె

క్లుప్తంగా

టపాసుల లారీ పట్టివేత



టపాసుల లారీని పట్టుకున్న అధికారులు

చిన్నమండెం : శివకాశీ నుంచి వెళ్తున్న టపాసుల లోడును చిన్నమండెంలో తహసీల్దార్ నరసింహులు శుక్రవారం పట్టుకున్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం తమ సిబ్బందితో కలిసి టపాసుల లారీని పట్టుకున్నామని ఆయన పేర్కొన్నారు. ఆ లారీని జిల్లా కేంద్రానికి తరలించామన్నారు. అనుమతి పత్రాలు చూపకపోవడంతో సీజ్ చేశామన్నారు. మరిన్ని వివరాలను త్వరలోనే తెలుపుతామని ఆయన వివరించారు.

రాయచోటిలో సినిమా షూటింగ్

రాయచోటి టౌన్ : రాయచోటి పట్టణంలో సినిమా షూటింగ్ జరుగుతోంది. దీనిని చూసేందుకు స్థానికులే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి అభిమానులు భారీగా తరలి వచ్చారు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. రాయచోటి ప్రాంతానికి చెందిన దర్శక, నిర్మాతగా వ్యహరిస్తూ నిర్మిస్తున్న దేవగుడి సినిమా రాయచోటి పరిసర ప్రాంతాలలో గత పదిహేను రోజులుగా షూటింగ్ జరుగుతోంది. శుక్రవారం రాయచోటి పట్టణంలోని సాయిబాబా మందిరం సమీపాన హైవే రోడ్డుపై షూటింగ్ చేయంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో పాదాచారులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది.

ఇంట్లో ఎవరూ లేనిది చూసి.. దోచేశారు

గొల్లపల్లిలో నాలుగు ఇళ్లలో చోరీ



వివరాలు సేకరిస్తున్న సీఐ వీవీ రమణ, ఎస్ఐ వెంకటేశ్వర్లు



బీరువాలో నుంచి కింద పడేసిన వస్తువులు

నందలూరు : తాళం వేసిన ఇళ్లనే లక్ష్యంగా చేసుకున్నారు. ఇళ్లలో ఎవరూ లేనిది గుర్తించి.. చోరీకి పాల్పడ్డారు. మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ పరిధి గొల్లపల్లిలో గురువారం రాత్రి దొంగలు పడి మూడు ఇళ్లలో తలుపులు, బీరువాలు పగులగొట్టి.. ఒక ఇంట్లో నగదు, బంగారు కమ్మలు దోచుకెళ్లారు. నాలుగో ఇంటిలో దొంగతనానికి ప్రయత్నించడంతో ఇంటిలో ఉన్న మహిళ, ఆమె కుమారుడు కేకలు వేయడంతో పరారైన సంఘటన జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. గొల్లపల్లి గ్రామంలో గోపినేని కొండయ్య తిరుపతిలో నివాసం ఉండటంతో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఇంటి తలుపులు, బీరువా పగులకొట్టి అక్కడ ఏమి చిక్కకపోవడంతో బయటికి వచ్చేశారు. అదే గ్రామంలో గొబ్బిళ్ల మల్లికార్జున హైదరాబాదులో నివాసం ఉండటంతో ఇంటిలో ఎవరూ లేకపోవడంతో.. ఆ ఇంటి తలుపులు, బీరువా పగులగొట్టి వెండి వస్తువులు ఉన్నప్పటికీ వాటిని వదిలిపెట్టి రూ.5 వేలు నగదు, ఒక జత చెవి కమ్మలు దోచుకున్నారు. అలాగే జి.ప్రసాద్ అరవపల్లిలో నివాసం ఉండటంతో ఇంటిలో ఎవరూ లేకపోవడంతో తలుపులు పగులగొట్టి చోరీకి ప్రయత్నించినప్పటికీ అక్కడ ఎటువంటి సామాన్లు లేకపోవడంతో బయటికి వచ్చేశారు. చివరకు ఆనంది రమాదేవి ఇంటి తలుపులను పగులగొట్టేందుకు ప్రయత్నించగా ఆమె, ఆమె కుమారుడు ఇంట్లోనే ఉండటంతో.. వారు కేకలు వేసి బంధువులకు ఫోన్ చేయడంతో బంధువులు అక్కడికి చేరుకోవడంతో దొంగలు అక్కడి నుంచి పరారయ్యారు. దీంతో రాజంపేట రూరల్ సీఐ బీవీ రమణ, ఎస్ఐ వెంకటేశ్వర్లు సంఘటనా స్థలానికి చేరుకొని వేలిముద్ర నిపుణులను రప్పించి వివరాలు సేకరించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు. పోలీసులు అనుమానితుడిగా భావిస్తున్న ఒక వ్యక్తి ఫొటోను రమాదేవికి చూపించగా.. గత రెండు రోజుల క్రితం ప్లాస్టిక్ బాటిళ్లను ఏరుకుంటూ వచ్చినట్లు ఆమె గుర్తించింది.

పట్టపగలే చోరీ

రూ. 4 లక్షల నగలు, నగదు అపహరణ



ఇంటిలో చిందరవందరగా పడిన వస్తువులు

మదనపల్లె : ఇరుగుపొరుగు ఇళ్లలో మనుషులు ఉండగానే, పట్టపగలే గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి రూ.4 లక్షల విలువైన నగలు నగలు చోరీ చేసిన సంఘటన శుక్రవారం మదనపల్లె పట్టణంలో జరిగింది. రెడ్డీస్ కాలనీ ఎక్స్‌టెన్షన్ సమీపంలోని వరసిద్ధి వినాయకుని గుడి వద్ద జగన్నాథం, రాధ దంపతులు నివాసం ఉంటున్నారు. వీరు కోళ్ల బైలు పంచాయతీ కాట్లాటపల్లె రోడ్డులో చిల్లర దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. ప్రతి రోజూ షాపునకు వెళ్లే క్రమంలో జగన్నాథం తండ్రి చిన్నరెడ్డయ్య పక్షవాతంతో బాధపడుతుండగా ఇంట్లోనే ఉంచి, తాళం వేసుకుని వెళ్లేవాడు. శుక్రవారం భార్యాభర్తలు ఇద్దరూ యథావిధిగా ఇంటికి తాళం వేసుకుని వెళ్లారు. ఇది గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు ఇరుగుపొరుగు ఇళ్లలో మనుషులు ఉండగానే, గుట్టు చప్పుడు కాకుండా ఇంటి తాళాలు పగలగొట్టి లోనికి ప్రవేశించారు. పడకగది హాలు వంటగది లో వస్తువులు చిందరవందరగా పడవేశారు, కప్ బోర్డులు, బీరువాలు తెరిచి అందులోని రూ.నాలుగు లక్షల నగలు, నగదు అపహరించుకు వెళ్లారు. జగన్నాథం మధ్యాహ్నం తండ్రికి భోజనం పెట్టేందుకు ఇంటికి రాగా, ఇంటి తలుపు తాళం పగలగొట్టి ఉండటంతో ఆందోళనగా లోపలికి వెళ్లి చూశాడు. ఇంటిలోని కప్ బోర్డ్‌లు తెరిచి ఉండడం, వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉండటం, వంటగదిలోని సామాన్లు ఎక్కడపడితే అక్కడ పడి ఉండడంతో చోరీ జరిగినట్లు నిర్ధారించుకున్నారు. చోరీ ఘటనపై వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. లక్ష రూపాయల నగదు, 55 గ్రాముల విలువైన బంగారు నగలు అపహరణకు గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. సీఐ చాంద్‌బాషా సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఒంటిమిట్టకు పూల సరఫరాకు టెండర్లు

ఒంటిమిట్ట(సిద్దవటం) : ఒంటిమిట్ట శ్రీ కోందండ రామస్వామి దేవాలయానికి సంబంధించి పూజా కైంకర్యాల కోసం ఏడాది పాటు పూల సరఫరా చేయడానికి టీటీడీ ఆధ్వర్యంలో టెండర్‌లు నిర్వహించారు. ఇందులో ఇద్దరు వ్యక్తులు పోటీ పడ్డారు. ఒంటిమిట్టకు చెందిన పి.వెంకటరమణ ఆ టెండర్‌ను దక్కించుకున్నట్లు టీటీడీ అధికారులు తెలిపారు. కేజీ పూలను రూ.98 స్వామి వారికి సరఫరా చేసే విధంగా వెంకటరమణ టెండరు వేశారు. ఈ లెక్కన రోజుకు 55 కేజీల పూల సరఫరా జరగనుండగా, ఏడాదికి 20 టన్నుల 75 కేజీల పూలను సరఫరా చేయనున్నారు.

డెంగీతో వివాహిత మృతి

ప్రొద్దుటూరు/రాజుపాళెం : రాజుపాళెం మండలంలోని అర్కటవేముల గ్రామానికి చెందిన కె.సువర్ణ (27) డెంగీ వ్యాధితో చికిత్స పొందుతూ మృతి చెందింది. అనారోగ్యంగా ఉండటంతో సువర్ణను ఈనెల 24న స్థానిక సాయికుటీర్ రోడ్డులోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. ఈమెకు డెంగీ సోకిందని 24 గంటలు గడవక ముందే పరిస్థితి విషమంగా ఉండటంతో.. కర్నూలులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి వైద్యుల సూచన మేరకు తరలించారు. అక్కడ ఆమె చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందింది. ఆమెను సాయంత్రం గ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. సువర్ణ, దిలీప్ నరసింహారెడ్డి దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. తమ కుటుంబంలో జరిగిన సంఘటనను చూసి గ్రామ ప్రజలు అప్రమత్తం కావాలని ఈ సందర్భంగా కుటుంబ యజమాని రిటైర్డు వ్యాయామ ఉపాధ్యాయుడు కోటా ఓబుళరెడ్డి తెలిపారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్ సమీపంలో గుర్తు తెలియని యువకుడు శుక్రవారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న వెంటనే రైల్వే పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. యువకుడు తెల్లటి, నల్లటి చారలు గల చొక్క, బ్లూ రంగు గల నైట్ పాయింట్ ధరించాడు. వయసు సుమారు 20–25 దాకా ఉండవచ్చు. చెన్నై నుంచి ఎర్రగుంట్లకు రైలు టికెట్ కలిగి ఉన్నాడు. మృతుడి ఆచూకీ ఎవరికైనా తెలిస్తే తమకు తెలియజేయాలని ఎర్రగుంట్ల రైల్వే పోలీసులు తెలిపారు.

బాత్రూంలో జారిపడి మహిళకు గాయాలు



తీవ్రంగా గాయపడిన మంజుల

మదనపల్లె : స్నానం చేసేందుకు బాత్రూంలోకి వెళ్లిన మహిళ ప్రమాదవశాత్తు జారి పడి తీవ్ర గాయాల పాలైన సంఘటన శుక్రవారం మదనపల్లెలో జరిగింది. అమ్మ చెరువు మిట్ట కు చెందిన శ్రీనివాసులు భార్య మంజుల (35) మధ్యాహ్నం స్నానం చేసేందుకు బాత్రూంలోకి వెళ్లి ప్రమాదవశాత్తు జారి కింద పడింది. ఈ ప్రమాదంలో ఆమె తలకు తీవ్ర గాయాలు కావడంతో, గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు.

పాముకాటుతో తీవ్ర అస్వస్థత



చికిత్స పొందుతున్న శివప్రసాద్

మదనపల్లె : పాము కాటుకు గురైన ఓ వ్యక్తి తీవ్ర అస్వస్థత పాలైన సంఘటన శుక్రవారం రామసముద్రం మండలంలో జరిగింది. చెంబుకూరు పంచాయతీ బలిజపల్లికి చెందిన మల్లప్ప కుమారుడు శివప్రసాద్ (39) పొలం వద్ద పనులు చేస్తుండగా పాము కాటు వేసింది. తీవ్ర అస్వస్థతకు గురికాగా గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు బాధితుడిని వెంటనే మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం



గాయపడిన వెంకటరమణారెడ్డి

మదనపల్లె : కుటుంబ సమస్యలతో ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా పరిస్థితి విషమించిన సంఘటన శుక్రవారం కురబలకోట మండలంలో జరిగింది. ఎగువ కొంగ వారిపల్లెకు చెందిన భూమి రెడ్డి కుమారుడు వెంకటరమణారెడ్డి(40) వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడు. మూడు నెలల క్రితం భార్య కుటుంబ సమస్యలతో భర్తతో గొడవపడి పిల్లలతో కలసి పుట్టింటికి వెళ్లిపోయింది. అనంతరం భార్యను కాపురానికి రప్పించేందుకు వెంకటరమణారెడ్డి ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో, మనస్థాపం చెంది శుక్రవారం ఇంటి వద్ద పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లి ప్రభుత్వం జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. ముదివేడు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

పోలీస్‌స్టేషన్ల స్థలాల రక్షణకు చర్యలు



కలకడ పోలీస్‌స్టేషన్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

కలకడ : జిల్లాలో పోలీస్‌స్టేషన్లకు దాతలు వితరణ చేసిన స్థలాలు, ప్రభుత్వం కేటాయించిన స్థలాలను పరిశీలించి, వాటిని హద్దులతో రక్షణ చేయడం పోలీసుల కర్తవ్యం అని జిల్లా పోలీస్ అధికారి విద్యాసాగర్‌నాయుడు అన్నారు. శుక్రవారం కలకడ పోలీస్ వ్యాపార సముదాయాలు, పాత పోలీస్‌క్వార్టర్స్ స్థలాలను ఆయన పరిశీలించారు. కలకడ పోలీస్ స్టేషన్‌కు కేటాయించిన భూమి మొత్తం హద్దుల మేరకు చదును చేసి రాతికూసాలు ఏర్పాటు చేసి కంచె వేయాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో కేసులపై పురోగతి సాధించాలన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తెలియజేయాలని పేర్కొన్నారు. సాధారణ తనిఖీలలో భాగంగానే కలకడ పోలీస్‌స్టేషన్, స్థలంను పరిశీలించినట్లు తెలిపారు. రెవెన్యూ రికార్డుల మేరకు కలకడ పోలీస్‌స్టేషన్‌కు ఎంత మేర స్థలం ఉందని, వాటి హద్దులను కలకడ సీఐ, ఎస్ఐ, తహసీల్దార్ అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ కృష్ణమోహన్, సీఐ గురునాథ, ఎస్ఐ రామాంజనేయులు, తహసీల్దార్ పనికుమార్, వీఆర్‌ఓ రెడ్డిశేఖర్, సచివాలయ సర్వేయర్, పోలీస్, రెవెన్యూ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

5 నుంచి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : అనంతపురంలో అక్టోబర్ 5,6,7,8 తేదీల్లో జరుగుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర వర్క్‌షాప్ మహాసభలు జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు, జిల్లా కార్యదర్శి ఎద్దు రాహుల్, వీరపోగు రవి తెలిపారు. శుక్రవారం నగరంలోని స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై పోరాటానికి శ్రీకారం చుట్టాలని, అందుకు ప్రణాళిక ఏర్పాటు చేయడం కోసం అనంతపురం వేదిక కాబోతుందన్నారు. అన్ని జిల్లాల నుంచి ఎస్ఎఫ్ఐ నాయకులు, కార్యకర్తలు హాజరు అవుతున్నారని, 4 రోజులు ఈ నిర్మాణ మహాసభలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి అజయ్, నాయకులు అరవింద్, దేవ, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ పగిలిన శ్రీరామ ఎత్తిపోతల పైప్‌లైన్



పైప్‌లైన్ పగిలి పోవడంతో వృథాగా పోయిన నీరు

ఒంటిమిట్ట(సిద్దవటం) : మండల పరిధిలోని కోటపాడు వద్ద నిర్మించిన శ్రీరామ ఎత్తిపోతల పథకం పైప్‌లైన్ మళ్లీ పగిలిపోయింది. ఈ పథకం ద్వారా కొన్ని రోజులుగా ఒంటిమిట్ట చెరువుకు ఇరిగేషన్ అధికారులు సోమశిల వెనుక జలాలు అందిస్తున్నారు. ఇదిలా ఉండగా శుక్రవారం ఎప్పటిలాగానే ఒంటిమిట్ట చెరువుకు సోమశిల వెనుక జలాలను అందిస్తుండగా.. కుడమలూరుకు పోవు అటవీ ప్రాంతంలో నీటి ఒత్తిడికి ఎత్తిపోతల పథకానికి సంబంధించిన పైప్‌లైన్ పగిలిపోయింది. దీంతో ఒంటిమిట్ట చెరువుకు సరఫరా అవుతున్న సోమశిల వెనుక జలాలు నిలిచిపోయాయి. ఇలా పైప్‌లైన్ పగిలిపోవడం సెప్టెంబర్ నెలలో ఇది మూడవ సారి కావడం గమనార్హం. దీనికి సంబంధించిన రైతులు ఇలా అయితే ఒంటిమిట్ట చెరువు నిండేదెన్నడు, తమ పంటలు పండేదెప్పుడు అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఇరిగేషన్ ఏఈ సాయి కిషోర్‌ని వివరణ కోరగా పైప్‌లైన్ పగిలిపోయిన విషయం వాస్తవమేనని, మరమ్మతులు చేసి ఒంటిమిట్ట చెరువుకు నీరు అందిస్తామని తెపారు.

హైకోర్టు ఆదేశాలు బేఖాతర్

సంఘమిత్రలపై చర్యలుండవని ఆదేశాలిచ్చి, తొలగించిన వైనం

బి.కొత్తకోట : మండలంలోని ఇద్దరు సంఘమిత్రలను తొలగించడంపై హైకోర్టును ఆశ్రయించగా వారి విధులకు ఎలాంటి ఆటంకాలు కలిగించవద్దని ఆదేశాలిచ్చింది. దీనిపై జిల్లా డీఆర్‌డీఏ పీడీ సూచన మేరకు స్థానిక అధికారులు మీ విధులకు ఆటంకం కలిగించమని ఆదేశాలు ఇచ్చినా.. వారిని తొలగించారు. వివరాలు ఇలా ఉన్నాయి.

బి.కొత్తకోట మండలంలోని బడికాయలపల్లె–3కి కె.ఈశ్వరమ్మ, బడికాయలపల్లె–4 జి.భారతీ సంఘమిత్రలుగా పని చేస్తున్నారు. వీరు వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులని తొలగించాలని స్థానిక కూటమి నేతల నుంచి తీవ్రమైన ఒత్తిడి వచ్చింది. దీనితో వీరిపై ఆరోపణలతో విధుల నుంచి తొలగించేందుకు సిద్ధమై చర్యలు తీసుకున్నారు. దీనిపై వీరు హైకోర్టును ఆశ్రయించగా సానుకూలంగా ఆదేశాలొచ్చాయి. వీరి విధులకు ఆటంకం కలిగించవద్దని కోర్టు సూచించింది. దీనిపై ప్రాజెక్టు డైరెక్టర్, స్థానిక ఏపీఎం, సీసీలకు ఆదేశాలు వచ్చాయి. ఈ పరిస్థితుల్లో పీడీ ఆదేశాల మేరకు అంటూ స్థానిక ఏపీఎం సంఘమిత్రలకు ఉత్తర్వులు పంపారు. హైకోర్టు ఆదేశాలు, పీడీ సూచనల మేరకు మీ విధుల్లో జోక్యం చేసుకోమని చెబుతూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే ఈ ఆదేశాలు కేవలం కాగితానికే పరిమితం చేశారు. ఆన్‌లైన్‌లో ఉండాల్సిన వీరి పేర్లను తొలగించి బడికాయలపల్లె–3కి పి.వెంకటరమణమ్మ, బడికాయలపల్లె–4కి రేవతిలను సంఘమిత్రలుగా నియమించేశారు. ఈ విషయమై శుక్రవారం ఏపీఎం మురళీ దృష్టికి తీసుకెళ్లి తమకు అన్యాయం చేస్తున్నారని చెప్పగా ఆయన స్పందించలేదని బాధిత సంఘమిత్రలు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై మురళీ వివరణ ఇస్తూ గ్రామసంఘం తీర్మానం మేరకు కొత్తవారిని నియమించినట్లు చెప్పారు.

వ్యక్తిగత కారణాలతోనే పూజారి ఆత్మహత్య

ప్రొద్దుటూరు కల్చరల్ : దత్తాత్రేయ స్వామి ఆలయ పూజారి వీణా రామానుజాచార్యులు వ్యక్తిగత కారణాలతోనే ఆత్మమత్య చేసుకున్నారని ఆలయ ఈఓ కె.రామచంద్రాచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఆలయంలో వివిధ పూజల పేరిట డబ్బులు వసూలు చేయడం, దత్త కల్యాణానికి నిధులు సేకరిస్తున్నాడని ఫిర్యాదులు వచ్చాయని, ఆ కార్యక్రమాలన్నీ దేవాదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తామని తాము తెలిపామన్నారు. దీనితో ఆయన ఈఓ కార్యాలయానికి వచ్చి అధికారులను దూషించేవారని పేర్కొన్నారు. ఆయన వ్యక్తిగత, కుటుంబ సమస్యల వల్ల మానసిక ప్రశాంతత లేక ఆత్మహత్యకు పాల్పడ్డారని, ఆయన ఆత్మహత్యకు తనకు ఎటువంటి సంబంధం లేదని వివరించారు.

29న సీమ విద్యావంతుల మహాసభలు

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక ఎన్జీఓ హోంలో శుక్రవారం రాయలసీమ విద్యావంతుల వేదిక 4వ రాష్ట్ర మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాయలసీమ విద్యావంతుల వేదిక రాష్ట్ర కోకన్వీనర్ మహమూద్ మాట్లాడుతూ ఈనెల 29న స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో ఉన్న మహిళా శక్తి భవనంలో రాయలసీమ విద్యావంతల వేదిక 4వ రాష్ట్ర మహాసభలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ మహాసభలో వక్తలుగా రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జ దశరథరామిరెడ్డి, అనంత హక్కుల ఉద్యమకారుడు రామాంజనేయులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొంటారని వివరించారు. ఈ కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ ప్రతినిధి వెంకటరెడ్డి, ఏపీఎన్‌జీఓ అసోసియేషన్ నాయకులు రఘురాంరెడ్డి, రామసుబ్బయ్య, వెంకటేశ్వర్లు, ప్రముఖ రచయిత దాదాహయత్, ఏపీ పౌర హక్కుల సంఘం ప్రతినిధి సురేష్‌బాబు, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్‌రెడ్డి, రాజేష్, విరసం ప్రతినిధి వరలక్ష్మి, చైతన్య మహిళా సంఘం ప్రతినిధి పద్మ, సుబ్బయ్య పాల్గొన్నారు.

హత్య కేసులో 12 మందికి యావజ్జీవ శిక్ష

- 16 ఏళ్ల క్రితం గ్రామంలో ఆధిపత్యం కోసం హత్య
- కేసు విచారణ సమయంలో అనారోగ్యంతో 9 మంది మృతి
- తీర్పు వెల్లడించిన ప్రొద్దుటూరు సెకండ్ ఏడీజే కోర్టు



హత్య కేసులో యావజ్జీవ కారాగార శిక్ష పడిన నిందితులను హాజరు పరిచిన పోలీసులు

ప్రొద్దుటూరు క్రైం : ఆధిపత్య పోరులో భాగంగా 16 ఏళ్ల క్రితం హత్యకు గురైన బీచు పుల్లారెడ్డి కేసులో 12 మందికి ప్రొద్దుటూరు ఏడీజే కోర్టు యావజ్జీవ కారాగార శిక్షతోపాటు రూ.4.70 లక్షల చొప్పున జరిమానా విధించింది. ఈ సంఘటనకు సంబంధించి 22 మందిపై కేసు నమోదైంది. అయితే ఈ కేసు విచారణలో ఉన్న సమయంలోనే అనారోగ్యంతో 9 మంది నిందితులు చనిపోయారు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మైదుకూరు మండలంలోని సర్వాయిపల్లె గ్రామంలో చాలా ఏళ్ల నుంచి నల్లపురెడ్డి వెంకటరమణారెడ్డి, ములకపాక పిచ్చిరెడ్డి వర్గీయుల మధ్య గ్రామాధిపత్య గొడవలు ఉండేవి. ఈ క్రమంలో గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, సిమెంట్‌రోడ్డుకు సంబంధించిన కాంట్రాక్ట్ పనులు నల్లపురెడ్డి వెంకటరమణారెడ్డి వర్గానికి వచ్చాయి. ఈ పనులన్నీ వీళ్లకే రావడంతో పిచ్చిరెడ్డి వర్గీయులు అసూయతో రగిలిపోయారు. వీరిని అంతమొందిస్తే గ్రామమంతా తమ గుప్పిట్లో ఉంటుందని భావించారు. ఈ క్రమంలో 2008 డిసెంబర్ 22న నల్లపురెడ్డిగారి వెంకటరామిరెడ్డి, బీచు పుల్లారెడ్డిపై రాడ్లు, వేటకొడవళ్లు, కట్టెలతో దాడి చేశారు. ప్రత్యర్థుల దాడిలో తీవ్రంగా గాయపడిన బీచు పుల్లారెడ్డి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటనపై మైదుకూరు పోలీస్‌స్టేషన్‌లో 315/2008 క్రైం నంబర్ కింద కేసు నమోదు అయింది. హత్య కేసులో పాల్గొన్న 22 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కేసు విచారణ ప్రొద్దుటూరు సెకండ్ ఏడీజే కోర్టులో కొనసాగుతూ వచ్చింది. తుది విచారణలో నేరం రుజువు కావడంతో 12 మంది ముద్దాయిలైన ములపాక పిచ్చిరెడ్డి, తవ్వా ఎర్రయ్యగారి లక్ష్మిరెడ్డి, జంగంరెడ్డి వీరారెడ్డి, తవ్వా మునింద్రారెడ్డి, జంగంరెడ్డి సుధాకర్, పెద్దసుబ్బారెడ్డి, ములపాక సువిగారి సుబ్బారెడ్డి, జంగంరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, జంగంరెడ్డి నడిపిసుబ్బారెడ్డి, తవ్వా ఎర్రయ్యగారి ఓబుళరెడ్డి, జంగంరెడ్డి సూర్యనారాయణరెడ్డి, జంగంరెడ్డి రామసుబ్బారెడ్డిలకు యావజ్జీవ కారాశిక్షతోపాటు రూ.4.70 లక్షల చొప్పున జరిమానా విధిస్తూ సెకండ్ ఏడీజే కోర్టు జడ్జి జీఎస్ రమేష్‌కుమార్ శుక్రవారం తీర్పు వెల్లడించారు. కాగా కేసు విచారణలో ఉండగా అనారోగ్య కారణాలతో 9 మంది మృతి చెందారు. కేసులోని ఏ3గా ఉన్న తవ్వా ఎర్రయ్యగారి పెద్ద ఓబుళరెడ్డి మీద నాన్‌బెయిల్ వారెంట్ ఉన్నట్లు అధికారులు తెలిపారు. కేసును పర్యవేక్షిస్తూ సకాలంలో సాక్షులను కోర్టులో హాజరుపరచి ముద్దాయిలకు శిక్ష పడేలా చేసిన ప్రస్తుత మైదుకూరు అర్బన్ సీఐ సయ్యద్‌హషం, ప్రొద్దుటూరు రూరల్ పీఎస్ కోర్టు మానిటరింగ్ సెల్ హెడ్‌కానిస్టేబుల్ నాగరాజు, మైదుకూరు ప్రాసెస్ కానిస్టేబుల్ రాజశేఖర్‌ను జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అభినందించారు. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పీపీ బి.రాంప్రసాద్‌రెడ్డి వాదనలు వినిపించారు.